క్లుప్తంగా

శానిటరీ కాంప్లెక్స్ పరిశీలన



కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్

దెందులూరు: స్వచ్ఛభారత్ మిషన్ నిధులు రూ.3 లక్షలతో కేంద్రప్రభుత్వం ప్రతిగ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల ఉద్యోగులకు కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు నిర్మిస్తోందని ఆర్‌డబ్ల్యూఎస్ దెందులూరు అసిస్టెంట్ ఇంజినీర్ రాజేంద్ర కుమార్ తెలిపారు. మండలంలోని దెందులూరు గ్రామ సచివాలయం వద్ద నిర్మించిన కాంప్లెక్స్‌ను గుత్తేదారు వరికూటి కోటేశ్వరరావుతో కలిసి పరిశీలించారు.

నేడు బువ్వనపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

నిడమర్రు: బువ్వనపల్లి గ్రామ సచివాలయం -2 పరిధిలో వంతెన డౌన్ వినాయకుని గుడి వద్ద నుంచి వెలంపేట వరకు శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హాజరై సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారులకు వివరిస్తారని, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం



భీమడోలులో క్లాత్, జూట్ బ్యాగుల వాడకంపై ప్రచారం చేస్తున్న క్లాప్ మిత్రలు

భీమడోలు: ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరుతూ గురువారం భీమడోలు గ్రామంలో క్లాప్ మిత్రలు దుకాణాల వద్ద అవగాహన కల్పించారు. స్వచ్ఛ భీమడోలుగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరుతూ క్లాప్ మిత్రలు దుకాణాల వద్ద నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వాడొద్దని వాల్ పోస్టర్లను గోడలకు అతికించారు. క్లాత్, జూట్ క్యారీ బ్యాగులను మాత్రమే వినియోగించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు, కేసులను విధిస్తారని హెచ్చరించారు. గ్రామంలో చెత్త చెదారాలను రోడ్లపై ఇష్టానుసారంగా వేయరాదని కోరారు.

28మందిపై బైండోవర్ కేసులు నమోదు



దెందులూరు తహసీల్దార్ కోర్టులో 28 మందిని బైండోవర్ చేసిన ఎస్సై రామారావు

దెందులూరు: హైకోర్టు ఆదేశాల మేరకు ఏగ్రామంలోనూ కోడిపందేలు, పేకాట జరగకుండా ముందస్తుగా 17 కేసుల్లో 28 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని దెందులూరు ఎస్సై రామారావు అన్నారు. గురు వారం దెందులూరు తహసీల్దార్ మేజిస్ట్రేట్ కోర్టులో వీరిని హాజరుపరిచామని మేజిస్ట్రేట్ నాంచారయ్య పూచికత్తులు తీసుకుని విడుదల చేశారన్నారు.

చెరువు ఆక్రమణ తొలగింపు



శ్రీరామవరం కొత్తకుంట చెరువులో ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన తహసీల్దార్ నాంచారయ్య

దెందులూరు: దెందులూరు మండలం శ్రీరామవరం గ్రామంలో 32 ఎకరాల కొత్తకుంటలో ఆక్రమణలు తొలగించాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, శ్రీరామవరం గ్రామ కార్యదర్శులు చౌదరి, సరళ, సిబ్బంది, హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. 32 ఎకరాల్లో ఎవరైనా మళ్లీ సాగుచేసినా, ఆక్రమణలకు ప్రయత్నించినా హైకోర్టు ధిక్కారణ, కేసు నమోదు, శిక్షలు ఉంటాయని తహసీల్దార్ తెలిపారు.

నాడు నేడుతో ప్రభుత్వ బడులకు మహర్దశ

భీమడోలు: నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడులకు కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పిస్తున్నట్లు పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమా బేగం హసేనా అన్నారు. రెండో దశలో నిధులతో పోలసానిపల్లి నెం.1 ప్రాథమిక పాఠశాల వద్ద నిర్మించే తరగతి గది పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ బడులను ఆధునీకీకరిస్తున్నట్లు చెప్పారు. నిబంధనలమేరకు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాని సూచించారు.

పింఛన్ సొమ్ము పెంపు.. అవ్వాతాతల ఆనందం రెట్టింపు

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

గణపవరం: ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పింఛన్లు పెంచిన ముఖ్యమంత్రి జగన్ నిరుపేదలు, అవ్వాతాతల ఆనందం రెట్టింపు చేశారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం గణపవరం కన్యకా పరమేశ్వరి వర్తకసంఘ భవనంలో మండలంలో కొత్త లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాసుబాబు మాట్లాడుతూ దేశంలోనే మరే రాష్ట్రంలోనూ సామాజిక పించన్లు ఇంత భారీగా ఇస్తున్న దాఖలాలు లేవన్నారు. పింఛన్ల సొమ్ముతో లక్షల మంది అవ్వాతాతలు, వితంతువులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎలాంటి చింతాలేకుండా బతికే భరోసాను సీఎం జగన్ కల్పించారన్నారు. అర్హతే ప్రామాణికంగా పింఛనర్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎవరైనా పింఛను దారుడు చనిపోతేనే కొత్త వారికి పింఛను ఇచ్చే పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. ప్రస్తుతం పింఛను సొమ్ము రూ.2750కు చేరిందని, వచ్చే ఏడాది నెలకు రూ.3వేలు పింఛను ఇస్తామని చెప్పారు. పేదల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యంగా మూడున్నరేళ్లుగా పాలన సాగుతోందని వివరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు వాసుబాబు అందజేశారు. ఈ సందర్భంగా వారు థ్యాంక్యూ సీఎం జగన్ సార్ అంటూ నినదించారు.



గణపవరంలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు, ప్రజాప్రతినిధులు



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రభుత్వ పథకాలు, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారి మద్దతు కోరడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కోరారు. గణపవరంలో నూతనంగా నియమితులైన గ్రామ సచివాలయ కన్వీనర్లు ,గ్రామ వలంటీర్లతో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఈ వ్యవస్థను అనేక రాష్ట్రాల్లో ప్రవేశపెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నాయని తెలిపారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు నభూతో నభవిష్యత్ అన్నారు. ప్రభుత్వ పథకాలను సక్రమంగా లబ్ధిదారులకు చేరవేయడంలో వారి పాత్ర కీలకమని కొనియాడారు. ప్రతినెలా ఒకటో తేదీ తెల్లవారు జామునే వారి తలుపుతట్టి పింఛన్లు అందించే తీరు అభినందనీయమన్నారు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో నియమించిన ఇద్దరు లేక ముగ్గురితో కూడిన సచివాలయ కన్వీనర్లు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కలిసి ఏకాభిప్రాయంతో ఈనెల 20 లోపు గృహ సారథులను నియమించుకోవాలని సూచించారు. గృహసారథులు వలంటీర్లతో కలిసి ప్రభుత్వ పథకాలను, పార్టీ, ప్రభుత్వం ఇచ్చే సందేశాలను ప్రజలకు చేరవేయాల్సి ఉంటుందని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో వీరు బాధ్యతాయుతంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు రాము, మండల ఉపాధ్యక్షురాలు సలాది రత్నకుమారి, జిల్లాపార్టీ అధికార ప్రతినిధి మాదేటి సురేష్, ప్రధాన కార్యదర్శి నడింపల్లి సోమరాజు, జిల్లా వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, నాయకులు కాకర్ల శ్రీను, రొంగల శ్రీను, తోటశ్రీను, కొండేటి వెంకటరత్నం, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్‌జానీ, గణపవరం సర్పంచ్ మూర అలంకారం, ఎంపీటీసీ సభ్యులు బత్తి సీతా మహాలక్ష్మి, దండురవి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

పెదవేగి : విద్యార్థులకు నాణ్యమైన విద్యానందించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.81.50 లక్షల ప్రభుత్వానిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన ఎంపీపీ తాతా రమ్యలతో కలిసి గురువారం ఉదయం ప్రారంభించారు. విద్యార్థుల భవిష్యత్ బంగారుమయం చేసేందుకే కార్పొరేట్ పాఠశాలల మాదిరిగానే ప్రభుత్వ పాఠశాలలలో ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన ప్రవేశపెట్టినట్లు చెప్పారు. నాడు - నేడు పథకంలో పాఠశాలలను ఆధునీకీకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పెదవేగి సొసైటీ చైర్‌పర్సన్ పెనుమాక వెంకట సుబ్బారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, డీసీసీబీ డైరెక్టర్, పెదవేగి మాజీ సర్పంచ్ తాతా సత్యనారాయణ, ఎంఈఓ సీహెచ్ బుధవ్యాస్, ఆర్ గంగాధర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పెదవేగిలో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయం

పెదవేగి : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం రాయన్నపాలెం పంచాయతీలోని ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడపడుచుకూ అండగా ఉన్నానని చెప్పడమే కాకుండా, నవరత్నాల్లో చెప్పిన ప్రతీ హామీని నెరవేర్చుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్య, సర్పంచ్ పర్వతనేని రమాదేవి, ఎంపీటీసీ మట్టా రాగిణి, రాటాలకుంట దేవస్థాన చైర్మన్ చళ్లగొళ్ల వెంకటేశ్వరరావు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



రాయన్నపాలెంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగన్ పాలన

భీమడోలు: ప్రజా సంక్షేమం కోసం నిత్యం పరితపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా ఉండాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. 111వ రోజు గురువారం రాత్రి పూళ్ల గ్రామంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వారికి పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ మేరకు బ్రోచర్లను వారికి అందజేశారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరానికి అధికారులను ఆదేశించారు. మునుపెన్నడూ లేని విధంగా ప్రజా సంక్షేమ పథకాలు పారదర్శకంగా తమకు అందుతున్నాయని, నిత్యం పేదల కోసం ఆలోచన చేస్తున్న జగనన్నకు తమ దీవెనలు మెండుగా ఉంటాయని లబ్ధిదారులు ముక్త కంఠంతో చెప్పి తమ అభిమానాన్ని చాటుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యిన తర్వాత పింఛన్ నగదు రెట్టింపు అయ్యిందని, తద్వారా అవ్వాతాతలు, వికలాంగులు, వితంతులు, ఒంటరి మహిళల జీవితాల్లో వెలుగులు నింపారని, దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసి మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారని వాసుబాబు వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండాలను ఎగురవేద్దామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, ఎంపీటీసీలు గొండు కృష్ణ చైతన్య, బొల్లారపు జ్ఞాన రమ్య పవన్, గంటా శ్రీనివాసరావు, పొల్నాటి శ్రీను, ఆజామ్, సర్పంచులు పాము సునీతామాన్ సింగ్, మానుకొండ నాగేశ్వరరావు, గుడివాడ సీతారామాంజనేయులు, నీలం శ్రీనివాసరావు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పులిచర్ల వెంకట కృష్ణారావు, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మద్దుల రాజా, మాజీ ఎంపీటీసీ పచ్చా బాబి తదితరులు పాల్గొన్నారు.



పూళ్లలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న పెదపాడు తహసీల్దార్ విజయకుమార్‌రాజు

పెదపాడు : మండలంలో కోడిపందేలు, పేకాట నిర్వహించే వారిపై కఠినచర్యలు చేపడతామని పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు తెలిపారు. పెదపాడు మండలంలోని తహసీల్దార్ కార్యాయంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పెదపాడు తహసీల్దార్ విజయకుమార్ రాజు, ఎస్సై బీ నాగబాబు మాట్లాడుతూ మండలంలో పేకాటలు, కోడిపందేలు ఎక్కడైనా నిర్వహిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోడిపందేలకు ప్రజలు దూరంగా ఉండాలి

పెదవేగి : కోడిపందేలకు ప్రజలు దూరంగా ఉండాలని పెదవేగి తహసీల్దార్ ఎన్ నాగరాజు సూచించారు. రానున్న సంక్రాంతి వేడుకలపై గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించి నిర్వహించే కోడిపందేల్లో పాల్గొనే వారిపై చట్టపరమైన చర్యలుంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎం లక్ష్మణ్, ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్, ఈఓపీఆర్డీ శ్రీనివాస్, వీఆర్ఓలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కోడిపందేలు, పేకాటల నివారణకు అవగాహన

దెందులూరు: సాంప్రదాయ క్రీడలు ఆడుకోవాలి తప్ప, చట్టవ్యతిరేకమైన కోడిపందేలు, పేకాట, ఇతర క్రీడలు ఆడరాదని దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య అన్నారు. గురువారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో కోడిపందేలు, పేకాట నివారణ నిమిత్తం ఏర్పాటు చేసిన విలేజ్ టీమ్స్‌తో జరిగిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. నిర్వాహకులు, ప్రోత్సాహకులపై ఉక్కు పాదం మోపుతామన్నారు. దెందులూరు ఎస్సై రామారావు మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యక్రమాలకు యువత దూరంగా ఉండాలన్నారు.



పెదవేగిలో వీఆర్‌ఓలు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య

బాధితులకు బాసటగా సీఎం



డయాలసిస్ పేషెంట్‌కి పింఛన్ అందజేస్తున్న ఎంపీటీసీ లక్ష్మీ శ్రీనివాస్

పెదవేగి : కన్నీటితో సతమతమవుతున్న జీవితాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బసటగా నిలిచారని వేగివాడ ఎంపీటీసీ సభ్యురాలు కొనకళ్ల లక్ష్మీశ్రీనివాస్ అన్నారు. పెదవేగి మండలం వేగివాడకు చెందిన పడమటి సుహాసిని గత కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో నాయకులు ఆమెకు డయాలసిస్ పింఛన్ మంజూరు చేయించారు. ఈ మేరకు ఏలూరులోని బంధువుల ఇంటి దగ్గర ఉన్న సుహాసినికి రూ.10 వేల పింఛన్‌ను కొనకళ్ల లక్ష్మీశ్రీనివాస్, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రియ అందించారు.

కోడి పందేలపై నిరంతర నిఘా

గణపవరం: కోడి పందేలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు గ్రామ నిఘాబృందాల సభ్యులు సహకరించాలని తహసీల్దార్ సన్యాసిరావు అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు, పేకాటలు, ఇతర అసాంఘిక కార్యక్రమాల కట్టిడికి వీఆర్వోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఎస్సై వేముల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా బరులు ఏర్పాటుచేస్తే ధ్వంసం చేసి స్థలం యజమానులు, నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అర్హతే ప్రామాణికంగా పేదలకు పింఛన్లు



రాయన్నపాలెం లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీటీసీలు

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి : అర్హత గల పేదలందరికీ వైఎస్సార్ పెన్షన్ కానుక కింద సామాజిక పింఛన్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగిలో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు సిపార్సు చేసిన వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందించే పరిస్థితి ఉండేదన్నారు. నేడు దళారీల ప్రమేయం లేకుండా వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటిలోనూ అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. గతంలో పింఛన్లు పొందాలంటే పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు నేరుగా ఇంటింటికి వెళ్లి తలుపు తట్టి పింఛన్ అందిస్తున్నామన్నారు. జగనన్న ప్రతి రూపాయిని పేదల కోసం ఖర్చుచేస్తున్నారని తెలిపారు.

అభివృద్ధి పథంలో శరవేగంతో దూసుకువెళ్తున్న ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అనేక కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారని అబ్బయ్యచౌదరి అసహనం వ్యక్తం చేశారు. దీనికి ప్రత్యక్ష నిదర్శనంగా మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చిన్న ఫ్లెక్సీ గొడవలో ప్రభుత్వ అధికారిపై దాడి చేయడం, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అకారణంగా పోలీసులతో గొడవ పెట్టుకుని తన చొక్కా అతనే చింపుకుని విజయవాడ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ పెట్టి పోలీసులపై అసత్య ఆరోపణలు చేస్తూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇకనైనా హుందాతన రాజకీయాలు చేస్తే మంచిదని హితవు పలికారు. అనంతరం పెదవేగి మండల పరిధిలో నూతనంగా మంజూరైన 398 మంది అర్హులకు పింఛన్లను పంపిణీ చేశారు. మండలంలో అర్హులైన 102 మందికి మంజూరైన కొత్త రేషన్ కార్డులను ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి అందజేశారు. వైఎస్సార్ బీమా పథకంలో అర్హులైన 6 గురికి చెక్కులు పంపిణీ, ఒక సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్‌పర్సన్‌లు, అధికారులు, వలంటీర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉంగుటూరులో పింఛన్ల పంపిణీ

ఉంగుటూరు : మండలంలో కొత్తగా 388 మందికి పెన్షన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ ప్రేమాన్విత తెలిపారు. ఉంగుటూరు పాతూరి వారి కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చేతులు మీదుగా పంపిణీ చేయనున్నట్ల పేర్కొన్నారు. వీరిలో వితంతువులు 126 , వృద్ధులు 149, వికలాంగులు 107, ఒంటరి మహిళ ఒకరు, మత్స్యకారులు ఒకరు, కల్లుగీత కార్మికులు నలుగురు ఉన్నట్టు ప్రేమానిత్వ వివరించారు. ఇప్పటి వరకు మండంలో 11,219 పెన్షన్లు ఇస్తుండగా, ఇకనుంచి 11,607 పెన్షన్లు ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు..

ఆత్మీయ సమావేశం

ఉంగుటూరులోని పాతూరి శివన్నారాయణ కమ్మ కల్యాణ మండపంలో శుక్రవారం 10 గంటలకు నూతన సచివాలయ కన్వీనర్లు, గ్రామ వంటీర్లుతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. ఎమ్మెల్యే వాసుబాబు దిశ నిర్దేశం చేస్తారని వివరించారు.

7న భీమడోలులో పింఛన్ల పంపిణీ

భీమడోలు: స్థానిక సంతమార్కెట్ వద్ద ఈనెల శనివారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ పింఛన్ కానుక భీమడోలు మండలంలో కొత్తగా 330 మందికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చేతుల మీదుగా అందజేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ భీమడోలు మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో ఆత్మీయ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత

ఉంగుటూరు: విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోన్న ఉంగుటూరు మండలం గోపినాథపట్నానికి చెందిన నారిన అప్పలరాజుకు వలంటీరు భీరా శ్రీనివాసరావు పింఛన్ అందజేశారు. తన సొంత ఖర్చులతో గోపినాధపట్నం నుంచి విజయవాడ వెళ్లి అప్పలరాజును కలిశారు. ఆయనకు పెన్షన్ అందజేయడంపై సర్పంచ్ పుచ్చకాయల విష్ణుమూర్తి, సచివాలయ సిబ్బంది, స్థానికులు వలంటీర్‌ను అభినందించారు.

విజయవాడ ఆసుపత్రిలో పెన్షన్ అందిస్తున్న వలంటీరు శ్రీనివాసరావు

